క్లుప్తంగా

అర్ధ శతాబ్ది కళోత్సవాలు

అమలాపురం టౌన్: స్థానిక మానవతా స్వచ్ఛంద సేవా సమితి 50వ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 5వ తేదీ మధ్యాహ్నం నుంచి స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల కళా వేదికపై అర్ధ శతాబ్ది కళాత్సోవ సంబరాలు నిర్వహిస్తున్నట్లు సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ముషిణి రామకృష్ణారావు తెలిపారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక ప్రదర్శనలు, కళా ప్రదర్శనల నిర్వహణతో పాటు యోగా–ధ్యానం, ఆధ్యాత్మిక, మానవతా విలువల పరిరక్షణ, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై సెమినార్లు నిర్వహిస్తామని వివరించారు.

సచివాలయ నూతన భవనం ప్రారంభం

అల్లవరం: బోడసకుర్రులో రూ. 43.6 లక్షల నిధులతో నిర్మించిన సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ప్రారంభించారు. సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి అధ్యక్షతన గురువారం జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆనందరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ కడలి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యురాలు దొమ్మేటి శ్రీశాంతి భవాని, టీడీపీ నాయకులు మెట్ల రమణబాబు, దాట్ల గోపిరాజు, చింతా శ్రీను, ఎంపీడీఓ కృష్ణమోహన్, పీఆర్ డీఈ రాజకుమార్, ఏఈ ఫకీర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ స్వామి, కార్యదర్శి దుర్గా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందన



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఐ.పోలవరం: విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి కౌశల్–2024 పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థి మంతెన వెంకట రమణను ఉపాధ్యాయులు, విద్యా కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు అభినందించారు. స్థానిక మురమళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న వెంకట రమణ జిల్లా స్థాయి కౌశల్ పోటీల్లో రూ.3,500 నగదు బహుమతితో పాటు రాష్ట్ర స్థాయిలో రూ.2 వేల నగదు బహుమతి పొందాడు. పాఠశాల పీఎంసీ చైర్మన్ విత్తనాల సత్యమూర్తి, సభ్యుడు సవరపు వెంకట రమణ, హెచ్‌ఎం మట్టపర్తి శ్రీనివాసరావు, కౌశల్ కన్వీనర్ ఆకెళ్ల సూర్య మోహన్‌లు విద్యార్థిని అభినందించారు.

మొక్కల తొలగింపు అన్యాయం

అమలాపురం టౌన్: స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలోని మున్సిపల్ పార్కులో అభివృద్ధి పనుల పేరుతో కొందరి ఇళ్ల వద్ద ఉన్న మొక్కలను జేసీబీతో తొలగిస్తూ వివక్షకు పాల్పడుతున్నారని బాధిత కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేశాయి. పార్కు చుట్టూ ఉన్న దాదాపు 40 ఇళ్ల ఆవరణల్లో ఉన్న మొక్కల జోలికి పోని మున్సిపల్ సిబ్బంది తమ ఇళ్ల వద్ద మాత్రమే మొక్కలు తొలగించేందుకు చొరవ చూపారని బాధితులు ఆరోపిస్తున్నారు. మున్సిపాలిటీకి చెందిన ఓ ప్రజా ప్రతినిధి ఈ వివక్షకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు.

విద్యుత్ మోటార్ల చోరీ

అల్లవరం: తూర్పులంకలో రొయ్యల సాగు చేస్తున్న అల్లవరం గ్రామానికి చెందిన చిట్నీడి వెంకట రత్నానికి చెందిన మూడు విద్యుత్ మోటార్లు బుధవారం రాత్రి చోరీకి గురయ్యాయి. ఈ ఘటనపై వెంకటరత్నం అల్లవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోడి పందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు

రూరల్ సీఐ ప్రశాంత్ కుమార్

అమలాపురం రూరల్: దొంగతనాలు, ఇతర నేరాలకు అడ్డుకట్ట వేసేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టినట్లు అమలాపురం రూరల్ సీఐ ప్రశాంత్ కుమార్ తెలిపారు. దొంగతనాలు నిరోధించేందుకు నైట్ రౌండ్లు తిరిగే పోలీసులకు పూర్తి స్థాయి దిశా నిర్దేశం చేస్తామన్నారు. సంక్రాంతి పండగను పురస్కరించుకొని కోడి పందాలు నిర్వహించేందుకు ఎటువంటి అనుమతులు లేవని వెల్లడించారు. ఎవరైనా కోడి పందాలు నిర్వహిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకు రండి



వ్యాపారులతో మాట్లాడుతున్న సీఐ ప్రశాంత్‌కుమార్

అల్లవరం: మండలంలోని ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని వ్యాపారస్తులకు సీఐ ప్రశాంత్‌కుమార్ సూచించారు. అల్లవరంలోని విజయదుర్గ అమ్మవారి ఆలయం వద్ద గురువారం సాయంత్రం వ్యాపారులతో సీఐ ప్రశాంత్‌కుమార్ మాట్లాడారు. ప్రధాన కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా వ్యాపారుల విలువైన ఆస్తులకు భద్రత ఉంటుందన్నారు. ఆయన వెంట ఎస్సై హరీష్‌కుమార్, వ్యాపారులు ఉన్నారు.

విద్యుత్ వినియోగదారుల వెతలు!

- వెంటాడుతున్న లోవోల్టేజీ సమస్య
- వినియోగానికి తగిన సరఫరా అందించడంలో వైఫల్యం
- పీటీఆర్‌ల కెపాసిటీ పెంపుతోనే పరిష్కారం



కాట్రేనికోన సబ్‌స్టేషన్‌లో అయిదు మెగావాట్ల కెపాసిటీ పీటీఆర్‌లు

కాట్రేనికోన: విద్యుత్ శాఖలో సిబ్బంది కొరత, లోవోల్టేజీ సమస్యలతో విద్యుత్ వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముమ్మిడివరం నియోజకవర్గ పరిధిలోని ముమ్మిడివరం సబ్ స్టేషన్, ఐ.పోలవరం మండలంలోని ఐ.పోలవరం, మురమళ్ల, గుత్తిన దీవి సబ్ స్టేషన్‌లు, కాట్రేనికోన మండల పరిధిలోని చెయ్యేరు, కాట్రేనికోన సబ్ స్టేషన్‌ల నుంచి విద్యుత్ సరఫరా చేస్తున్నారు. విద్యుత్ సబ్ స్టేషన్‌లో విద్యుత్‌ను స్టోర్ చేసి సరఫరా చేసే పీటీఆర్ కెపాసిటీ అంతంత మాత్రంగా ఉండటంతో లోవోల్టేజీ సమస్యలు తలెత్తుతున్నాయి. చెరువులకు విద్యుత్తు వినియోగంతో పాటు గృహావసరాలకు వాడకం మరింత పెరిగింది. వినియోగదారులకు అవసరమైన విద్యుత్‌ను సరఫరా చేసే పీటీఆర్‌ల కెపాసిటీ తక్కువ కావడంతో తరచూ ట్రిప్ అవుతోంది. లోవోల్టేజీ సమస్యలు అధికంగా ఉన్నాయని, అధిక కెపాసిటీ కలిగిన పీటీఆర్‌లు ఏర్పాటు చేయాలని అనేక పర్యాయాలు ఉన్నతాధికారులకు నివేదికలు పంపినా ఫలితం లేకుండా పోయింది.

స్థలం సమకూరక నిధులు వెనక్కి..

కాట్రేనికోనలో విద్యుత్ సమస్యలు పరిష్కరించేందుకు విద్యుత్ శాఖ అధికారులు పల్లంకుర్రులో సబ్ స్టేషన్ ఏర్పాటు చేసేందుకు ఐదేళ్ల క్రితం సుమారు కోటి రూపాయలు మంజూరు చేశారు. అయితే విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటు చేసేందుకు అవసరమైన స్థలం ఇచ్చేందుకు దాతలు ముందుకు రాకపోవడంతో నిధులు వెనక్కు మళ్లాయి. కాట్రేనికోన మండలంలో చెయ్యేరు విద్యుత్ సబ్ స్టేషన్‌లో 5 మెగావాట్ల కెపాసిటీ పీటీఆర్‌లు రెండు, కాట్రేనికోనలో 5 మెగావాట్ల కెపాసిటీ పీటీఆర్‌లు రెండు ఉన్నాయి. అయితే చెరువులకు 24 గంటల విద్యుత్ అవసరాలను గుర్తించి చెయ్యేరులో 8 మెగావాట్ల కెపాసిటీ గల పీటీఆర్‌ను ఏర్పాటు చేశారు. చెయ్యేరు, కాట్రేనికోన సబ్‌స్టేషన్‌లలో 5 మెగావాట్స్ కెపాసిటీ పీటీఆర్‌ల స్థానంలో 8 మెగావాట్ల కెపాసిటీ పీటీఆర్‌లను ఏర్పాటు చేస్తేనే లోవోల్టేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది.

సిబ్బంది కొరత

సబ్ స్టేషన్‌ల పరిధిలో సిబ్బంది కొరత అధికంగా ఉండటంతో పని ఒత్తిడితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముమ్మిడివరం, ఐ.పోలవరం మండలాల్లో సిబ్బంది కొరత అంతంత మాత్రంగానే ఉన్నా కాట్రేనికోన మండలంలో సిబ్బంది లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మూడు నెలల క్రితం కాట్రేనికోన ఏఈ నాగేశ్వరరావు బదిలీపై వెళ్లిపోవడంతో ఈ పోస్టు ఇప్పటికీ ఖాళీగా ఉంది. ప్రస్తుతం సబ్ ఇంజినీరు ఇన్‌చార్జి ఈఏ గా బాధ్యతలు చూస్తున్నారు. పర్మినెంటు ఏఈ లేకపోవడంతో విద్యుత్ సమస్యలపై ఎవరికి చెప్పుకోవాలో తెలియక మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏఈ పోస్టు ఖాళీగా ఉండటంతో సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మండలంలో సబ్ ఇంజినీరు, లైన్ ఇన్‌స్పెక్టరుతో పాటు 4గురు ఎల్‌ఎంలు ఉన్నారు. అయితే కాట్రేనికోనలో 2, చెయ్యేరులో ఒకటి, గెద్దనపల్లిలో 1, బలుసుతిప్ప, పల్లంకుర్రు, పల్లంలలో 1 చొప్పున ఏఎల్‌ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఉప్పూడి ఫీడర్ పరిధిలోని చిర్రయానం, కాట్రేనికోన ఫీడర్ పరిధిలోని పల్లంకుర్రు–బలుసుతిప్ప, కొత్తపాలెం, మొల్లేటి మొగ, గొల్లపాలెం, చాకలిపేట, పల్లం వెళ్లే లైన్‌లలో విద్యుత్ అంతరాయం ఏర్పడితే సిబ్బంది లేక తెల్ల వారేవరకు సరఫరా ఇచ్చే పరిస్థితి లేదు. సంబంధిత అధికారులు స్పందించి కాట్రేనికోన ఏఈ పోస్టుతో పాటు, ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయడంతో పాటు పీటీఆర్‌ల కెపాసిటీ పెంచి లోవోల్టేజీ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

> **సమస్యను పరిష్కరించండి**
>
> కాట్రేనికోన సబ్ స్టేషన్‌లోని 5 మెగావాట్ల కెపాసిటీ గల పీటీఆర్‌ల స్థానంలో 8 మెగావాట్ల కెపాసిటీ గల పీటీఆర్‌లను ఏర్పాటు చేయాలి. అప్పుడే లోవోల్టేజీ సమస్యకు పరిష్కారం లభిస్తుంది. దీంతో పాటు ఖాళీగా ఉన్న పోస్టులలో సిబ్బంది నియామకం చేపడితే ప్రజలకు విద్యుత్ సేవలు సకాలంలో అందుతాయి.
>
> నల్లా నానాజీ, స్థానికుడు, కాట్రేనికోన.

లారీ, కారు ఢీ: పలువురికి గాయాలు



నుజ్జు నుజ్జయిన కారు ముందు భాగం

యానాం: జాతీయ రహదారిలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ, కారు ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న వారికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసుల వివరాల ప్రకారం యానాం మీదుగా తాటిపాక గ్రామానికి వెళుతున్న కారును బైపాస్ సెంటర్‌లో తమిళనాడుకు చెందిన లారీ ఎదురుగా వచ్చి ఢీకొంది. తాటిపాక గ్రామానికి చెందిన కారు యజమాని వెలుగొండ సత్తిపండుతో సహా మిగిలిన ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ ఎస్సై శేరు నూకరాజు తెలిపారు.

అమలాపురం తహసీల్దార్‌గా అశోక్ ప్రసాద్



తహసీల్దార్ అశోక్ ప్రసాద్‌ను అభినందిస్తున్న జేఏసీ చైర్మన్ దివాకర్ తదితరులు

అమలపురం రూరల్: పట్టణ తహసీల్దార్‌గా పలివెల అశోక్ ప్రసాద్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన కిషోర్‌బాబు పదవీ విరమణ చేయడంతో ఆయన స్థానంలో డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేస్తున్న అశోక్ ప్రసాద్ ఎఫ్‌ఏసీ హోదాలో తహసీల్దార్ బాధ్యతలను చేపట్టారు. తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన అశోక్ ప్రసాద్‌ను రాష్ట్ర రెవెన్యూ జేఏసీ చైర్మన్ వీఎస్ దివాకర్, నాయకుడు తిక్కిరెడ్డి సుభాష్ చంద్రబోస్‌తో పాటు వీఆర్‌ఓలు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

వాకర్స్ ప్రతినిధులకు సత్కారం



ప్రొఫెసర్ నాగేంద్ర, నాగేశ్వరరావులను సత్కరిస్తున్న వాకర్స్ క్లబ్‌ల ప్రతినిధులు

అమలాపురం టౌన్: ఇటీవల జిల్లా కేంద్రం ఏలూరులో జరిగిన ఇంటర్నేషనల్ కన్వెన్షన్‌లో అంతర్జాతీయ వాకర్స్ ఉపాధ్యక్షునిగా అమలాపురానికి చెందిన ప్రొఫెసర్ గోకరకొండ నాగేంద్ర, జిల్లా గవర్నర్‌గా సప్పా నాగేశ్వరరావులు ఎన్నికైన సందర్భంగా స్థానిక శ్రీ కళా గ్రాండ్‌లో గురువారం వారికి అభినందన సత్కారాలు జరిగాయి. అమలాపురం వాకర్స్ హెల్త్ క్లబ్ అధ్యక్షుడు బోణం సత్య వరప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ సత్కార సభలో వాకర్స్ అంతర్జాతీయ మాజీ అధ్యక్షుడు డాక్టర్ పీఎస్ శర్మ మాట్లాడుతూ వాకర్స్ విప్లవంలో గత మూడు దశాబ్దాలకు పైగా ప్రొఫెసర్ నాగేంద్ర, నాగేశ్వరరావుల శ్రమే ఇప్పుడు వారికి ఆ స్థాయి పదవులు దక్కేందుకు దోహద పడ్డాయన్నారు. ఇదే వేదికపై అమలాపురం వాకర్స్ హెల్త్ క్లబ్, అమలాపురం మహిళా వాకర్స్ హెల్త్ క్లబ్‌లు నిర్వహించిన పలు చైతన్య కార్యక్రమాలకు గాను ఆ రెండు క్లబ్‌లకు బెస్ట్ క్లబ్‌ల అవార్డులు లభించాయి. ఆ రెండు క్లబ్‌ల అధ్యక్షులు బోణం సత్య వరప్రసాద్, మహిళా క్లబ్ అధ్యక్షురాలు ఎస్ ఎస్ పద్మావతిలను ఘనంగా సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో మహిళా వాకర్స్ క్లబ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పేరి లలిత, కార్యదర్శి యర్రమిల్లి అనంతలక్ష్మి, వాకర్స్ ఏరియా ఉపాధ్యక్షుడు తేతల సత్యనారాయణరెడ్డి, వాకర్స్ ప్రతినిధులు గుర్రం రామకృష్ణ, పచ్చిగోళ్ల రాజా, నూకల సత్యనారాయణ, కుడుపూడి త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభా పురస్కారాల బ్రోచర్ల ఆవిష్కరణ



తెలుగు కీర్తి ప్రతిభా పురస్కారాల బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు, శ్రీశ్రీ కళా వేదిక ప్రతినిధులు

అమలాపురం టౌన్: విజయవాడలో ఈ నెల 21న జరగనున్న తెలుగు కీర్తి ప్రతిభా పురస్కారాల బ్రోచర్లను స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలో ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు శ్రీశ్రీ కళా వేదిక జిల్లా ప్రతినిధులతో కలిసి గురువారం ఆవిష్కరించారు. శ్రీశ్రీ కళా వేదిక అంతర్జాతీయ సీఈవో డాక్టర్ కత్తిమండ ప్రతాప్ ఆధ్వర్యంలో జరగనున్న ఈ కార్యక్రమానికి తన వంతు సహకారం ఉంటుందని ఎమ్మెల్యే చెప్పారు. ఉభయ తెలుగు రాష్ట్రాలలో సాహిత్య సేవలు అందిస్తున్న శ్రీశ్రీ కళా వేదిక సేవలు ప్రశంసనీయమన్నారు. తెలుగు కీర్తిని నలు దిశలా విస్తరించే దిశగా ప్రతిభా పురస్కారాల ద్వారా సాహిత్యానికి మరింత పెద్ద పీట వేస్తున్నామని శ్రీశ్రీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు నల్లా నరసింహమూర్తి అన్నారు. కార్యక్రమంలో వేదిక జిల్లా కన్వీనర్, కోనసీమ రచయితల సంఘం అధ్యక్షుడు బీవీవీ సత్యనారాయణ, వేదిక జాతీయ కార్యదర్శి మాకే బాలార్జున సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి



ఇంజరంలో కార్మికుల సమస్యలపై మాట్లాడుతున్న శివరామ ప్రసాద్

తాళ్లరేవు: పూర్తి స్థాయిలో పనుల్లేక పండగ వేళల్లో సైతం పస్తులుండాల్సిన దుస్థితి నెలకొందని, ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని చేనేత కార్మికులు డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని ఇంజరం గ్రామ పంచాయతీలో శ్రీ వీరభద్ర స్వామి ఆలయం వద్ద గ్రామ సర్పంచ్ ముద్దన వెంకట శివ రామ ప్రసాద్ అధ్యక్షతన చేనేత కార్మికుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కార్మికులు నూలు వీరవెంకట సత్యనారాయణ, లక్కింశెట్టి లోవకృష్ణ, నూలు జగన్నాథం, ఇనుమర్తి సూర్యాకాంతంలు మాట్లాడారు. ప్రభుత్వం విద్యుత్ మగ్గాలను ప్రోత్సహించడం వల్ల చేనేత పరిశ్రమ కుంటుబడిందని వాపోయారు. సర్పంచ్ శివరామప్రసాద్ మాట్లాడుతూ చేనేత కార్మికులకు గత ప్రభుత్వం ఏటా రూ.24 వేలు అందజేసేదని అన్నారు. 100 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇచ్చిందన్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు గడుస్తున్నా చేనేత కార్మికులను పట్టించుకోలేదన్నారు. సమావేశంలో కార్మికులు బల్లకోటి మల్లేష్, జట్ల ప్రసాద్, బీరక లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాల పెంపునకు కృషి చేయాలి



అమలాపురంలో శిక్షణ కార్యక్రమంలో సూచనలిస్తున్న సీఎంఓ సుబ్రహ్మణ్యం

తాళ్లరేవు: విద్యార్థులు ప్రగతి సాధించేలా పాఠశాల విద్యా కమిటీలు కృషి చేయాలని ఎంపీపీ రాయుడు సునీత కోరారు. గురువారం స్థానిక జూనియర్ కళాశాలలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎస్‌ఎంసీ చైర్మన్‌లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ సునీత ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పాఠశాలల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించి విద్యలో నాణ్యత ప్రమాణాలు పెంచే విధంగా కృషి చేయాలన్నారు. మండల విద్యాశాఖాధికారి మోకా ఉమ, రిసోర్స్ పర్సన్లు మురళీకృష్ణ, వీరేంద్ర, సత్య కల్యాణిలు శిక్షణ ద్వారా అవగాహన కల్పించారు.

అమలాపురం రూరల్: పాఠశాల యాజమాన్య కమిటీలు, ఉపాధ్యాయులు సమన్వయంతో పాఠశాలల అభివృద్ధికి కృషి చేయాలని ఎస్‌ఎస్‌ఏ సీఎంవో బోరుసు సుబ్రహ్మణ్యం అన్నారు. అమలాపురం మండలంలో పాఠశాల యాజమాన్య కమిటీల చైర్మన్లు, ప్రధానోపాధ్యాయులకు పేరూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కోఆర్డినేటర్ దుర్గాదేవి, ఎంపీఓ భీమారావు, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రధానోపాధ్యాయులు, ఎస్‌ఎంసీ చైర్మన్‌లు కలిసి పని చేయాలని ఎంఈవో కె.కిరణ్‌బాబు అన్నారు. మండలంలోని భీమనపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం మండలంలోని 82 పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎస్‌ఎంసీ చైర్మన్‌లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంఈవో ఎస్. సత్యకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఓఎన్జీసీ పరిహారం పంపిణీకి ఏర్పాట్లు

తాళ్లరేవు: మత్స్యకారులకు ఓఎన్‌జీసీ నష్ట పరిహారం అందించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. కోరంగి పంచాయతీలోని జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న స్థలంలో ఈ మేరకు ఏర్పాట్లు చేశారు. ఏర్పాట్లను ముమ్మిడివరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు, అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ జిల్లాల ఆర్డీఓలు మాధవి, శ్రీకరణ్‌లు, తహసీల్దార్ పితాని త్రినాథరావు, మత్స్యశాఖ అధికారులు పరిశీలించారు. ఓఎన్‌జీసీ కంపెనీ ద్వారా రెండు జిల్లాల నుంచి ఐదు నియోజకవర్గాలలోని 8 మండలాలల్లోని 69 గ్రామాలకు చెందిన 23,458 మంది లబ్ధిదారులకు రూ.148 కోట్ల పరిహారాన్ని వ్యవసాయ, మత్స్యశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు పంపిణీ చేయనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

ఎంపీ హరీష్‌ను కలిసిన సర్పంచ్‌లు



ఎంపీ హరీష్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న సర్పంచ్‌లు

అమలాపురం రూరల్: ఎంపీ గంటి హరీష్ మాధుర్‌ను అమలాపురం మండల సర్పంచుల సమాఖ్య ఆధ్వర్యంలో సర్పంచ్‌లు మర్యాద పూర్వకంగా కలిశారు. అమలాపురంలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో గురువారం మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షురాలు నక్కా అరుణకుమారి, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం కార్యదర్శి పెనుమాల సునీత, సర్పంచ్‌లు రేలంగి దుర్గారావు, కరాటం ప్రసన్న ప్రవీణ్, పందిని విజయశ్రీను, చెల్లుబోయిన నాని, గంగుమళ్ల ఏసుబాబు, నాయకులు చంద్రశేఖర్, నక్కా కృష్ణ, ఏడుకొండలు తదితరులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

సీహెచ్‌ఓ శ్రీహరి సేవలు మరువలేనివి



సీహెచ్‌ఓ దంపతులను సన్మానిస్తున్న జిల్లా వైద్యాధికారి దుర్గారావు

కాట్రేనికోన: కాట్రేనికోన పీహెచ్‌సీ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్(సీహెచ్‌ఓ)గా పదవీ విరమణ చేసిన శ్రీహరి దంపతులకు ఆరోగ్య సిబ్బంది గురువారం ఘనంగా సన్మానించారు. పీహెచ్‌సీ వైద్యాధికారిణి నీలిమ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా వైద్యాధికారి డా.ఎం. దుర్గారావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సామాజిక సేవపై అభిమానం ఉన్న వారు మాత్రమే వైద్యారోగ్య శాఖలో ఉద్యోగ బాధ్యతలు చేపడతారన్నారు. శ్రీహరి సేవలు మరువలేనివని అభినందించారు. వైద్య, ఆరోగ్య సిబ్బంది, స్థానిక సర్పంచి గంటి వెంకట సుధాకర్, స్థానికులు శ్రీహరి దంపతులను సన్మానించారు.

ఆచూకీ లభించని మోటారు సైకిళ్లకు వేలం

అమలాపురం టౌన్: పట్టణ పరిధిలో 2021వ సంవత్సరం జూలై 31వ తేదీకి ముందు వివిధ ప్రదేశాల్లో వాహన యజమానులు వదిలేసిన 18 మోటారు సైకిళ్లకు సంబంధించి ఇప్పటివరకూ చిరునామాలు దొరకలేదని, సంబంధిత వాహన యజమానులు రాలేదని పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు. ఈ 18 మోటారు సైకిళ్లపై కేసులు నమోదు చేసి అప్పటి నుంచి చిరునామాల కోసం, యజమానుల కోసం గత 40 నెలలుగా వాకబు చేస్తూనే ఉన్నామన్నారు. ఎలాంటి సమాచారం లభించకపోవడంతో ఆ వాహనాల వివరాలను పోలీస్ నోటీసు బోర్డుల్లో ఉంచుతామన్నారు. సదరు వాహన యజమానులు ఎవరైనా ఉన్నట్లయితే వారు తమ వాహనాలకు చెందిన రికార్డులు, ఇతర ఆధార పత్రాలు చూపించి తీసుకువెళ్లాలని కోరారు. సంబంధిత యజమానులు రాని పక్షంలో ఆ మోటారు సైకిళ్లకు వేలం పాట నిర్వహించి వచ్చే ఆదాయ నగదును ప్రభుత్వానికి జమ చేస్తామని సీఐ వీరబాబు స్పష్టం చేశారు.

ప్రాథమిక పాఠశాలల్లో ఉచిత వైద్య శిబిరాలు



అమలాపురంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో విద్యార్థులతో డాక్టర్ ప్రభాకర్, ఇతర వైద్యులు

అమలాపురం టౌన్: శ్రీ సత్యసాయి సేవా సమితి ఏర్పాటై వందేళ్లు పూర్తయిన సందర్భంగా పలు ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్య రక్షణ కోసం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఆ సేవా సమితి అమలాపురం జోన్ కన్వీనర్ డాక్టర్ జి.ప్రభాకర్ తెలిపారు. ఇందులో భాగంగా జోన్ పరిధిలోని కోనసీమ వ్యాప్తంగా పలు ప్రాథమిక పాఠశాలల్లో గురువారం ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశామని తెలిపారు. సేవా సమితికి వందేళ్లు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని జోన్ పరిధిలో వంద ప్రాథమిక పాఠశాలల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో ముందుకు వెళుతున్నామని చెప్పారు. అమలాపురం పట్టణం నారాయణపేటలోని లాల్ బహదూర్ శాస్త్రి మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి మందులను అందజేసినట్లు డాక్టర్ ప్రభాకర్ తెలిపారు.

సీతారామపురంలో గోశాల ప్రారంభం

తాళ్లరేవు: ఎన్ఆర్‌ఈజీఎస్ ద్వారా కోరంగి పంచాయతీ సీతారామపురంలో నిర్మించిన గోశాలను గురువారం ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ రాయుడు సునీత, గ్రామ సర్పంచ్ పెయ్యల మంగేష్, నాయకులు గుత్తుల సాయి, టి.లక్ష్మణరావు, నడింపల్లి వినోద్, కట్టా త్రిమూర్తులు, రాయుడు గంగాధర్, ఎంపీడీఓ సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి రమణ, ఏపీఓ తేజస్వి తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలి

ఉప్పలగుప్తం: ఆటో డ్రైవర్లు నిబంధనలను కచ్చితంగా పాటించి ప్రమాదాలు నివారించాలని ఎస్సై రాజేష్ సూచించారు. మండలంలోని ఆటో డ్రైవర్లకు రహదారి భద్రత నిబంధనలపై గురువారం ఉప్పలగుప్తంలో సమావేశం ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. విధిగా యూనిఫాం ధరించాలని, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని సూచించారు. నిబంధనలు సక్రమంగా పాటించకపోతే చర్యలు తప్పవన్నారు.

కలెక్టర్‌కు మత్స్యకారుల ఫిర్యాదు

అమలాపురం రూరల్: చేపల వేటకు వెళ్లేందుకు అంతర్వేది ఫిషింగ్ హార్బర్‌కు వస్తుండగా స్థానిక మత్స్యకారులు, వలకట్లు రైతులు అడ్డుకున్నారని జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్‌కు రొయ్యల బోట్ల మత్స్యకారులు గురువారం ఫిర్యాదు చేశారు. అంతర్వేది మత్స్యకారులు ఇబ్బంది పెడుతూ ఘర్షణకు దిగుతున్నారని వాపోయారు. చేపలు అమ్మడానికి వీలు లేదని హెచ్చరిస్తున్నట్లు వాపోయారు. దీనిపై కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు.

వృద్ధులకు చీరల పంపిణీ



ఎమ్మెల్సీ ఇజ్రాయిల్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న రెవెన్యూ ఉద్యోగులు

అల్లవరం: నల్లగుంట క్రీస్తు సంఘం ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకల్లో భాగంగా బొమ్మి నరసింహమూర్తి, మంగాయమ్మ ట్రస్టు ద్వారా వృద్ధులకు సమకూర్చిన చీరలను ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ దంపతులు గురువారం పంపిణీ చేశారు. సంఘ దైవజనులు ఎలియారాజు క్రీస్తు సువార్తలను అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ సాధనాల వెంకటరావు, వైఎస్సార్ సీపీ నాయకులు చింతా రామకృష్ణ, సంఘస్తులు విప్పర్తి ప్రసాదు, విజయ్, అయితాబత్తుల నాని, సాధనాల నాగరాజు, ఆకుమర్తి ప్రసాదు, దానియేలు, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు. గోడిలోని ఎమ్మెల్సీ నివాసంలో ఎమ్మెల్యే ఇజ్రాయిల్‌ను రెవెన్యూ అధికారులు గురువారం మర్యాద పూర్వకంగా కలసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ వీవీఎల్ నరసింహారావు, డీటీ అడపా సుబ్రహ్మణ్యం, ఆర్‌ఐ రత్నం, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.